www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 15 | జూన్ | 2025
పేజీలు : 6

## రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం




-లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
-జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

2లో

# వ్యాధుల కాలం.. తస్మాత్ జాగ్రత్త..!



- కీటక జనిత వ్యాధులపై ముందస్తు దృష్టి
- మన్యంలో 142 హై రిస్క్ గ్రామాలు
- హాస్టళ్లలో దోమల మందు పిచికారీ
- ప్రభుత్వ హాస్టళ్లలో కొనసాగుతున్న దోమలమందు పిచికారీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కీటక జనిత వ్యాధుల కాలం వచ్చేస్తోంది. జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలం ప్రారంభం అవుతుండటంతో మన్యంలో ప్రజలు పెద్ద ఎత్తున తరుణ వ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. జిల్లాలోని మన్యంలో ప్రతీ ఏటా పెద్దఎత్తున కేసులు నమోదవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ,

మిగతా 2లో..

## విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలి




-రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో విత్తన చట్టం బిల్లుపై సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతులకు మేలు చేసే కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి ఖమ్మం ఉమ్మడిజిల్లా పరిధిలోని వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల కారణంగా రైతులు అనేక నష్టాల పాలవుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కలిసి తెలంగాణ రాష్ట్ర పరిధిలో చట్ట ప్రకారం రైతులను ఆదుకునేందుకు విత్తన చట్టం ముసాయిదా

మిగతా 2లో..

## ప్రపంచంపై యుద్ధ మేఘాలు



-పెరుగుతున్న పరస్పర దాడులు
-ప్రమాదకరంగా మోడీ విధానాలు
-హామీల అమలుపై ప్రజల్లో నిరాశ
-సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

**ప్రజాపక్షం/మధిర :** ప్రపంచంపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని వివిధ దేశాల మధ్య జరుగుతున్న పరస్పర దాడులతో నిత్యావస వస్తువుల ధరలు ముఖ్యంగా క్రూడాయిల్ ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడే అవకాశం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం మధిరలోని రిక్రియేషన్ క్లబ్‌లో శనివారం బెజవాడ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ట్రంప్ సామ్రాజ్యవాద విధానాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతిబంధకంగా మారాయని దేశాల మధ్య దాడులు, ఉద్రిక్త పరిస్థితులు పేద, మధ్యతరగతి ప్రజలపై పెను ప్రభావం చూపుతాయని ఆయన తెలిపారు. భారత దేశంలో మోడీ విధానాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని మోడీ ప్రధానిగా కాగా సంపన్న వర్గాల ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని హేమంతరావు ఆరోపించారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్నారని సామాన్యమైన కోటీశ్వరులుగా ఉన్న అదానీ మోడీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచ కోటీశ్వరులలోనే 10వ స్థానాన్ని ఆక్రమించాడని ఆయన తెలిపారు. రైతాంగ రుణాలను మాఫీ చేయడానికి మోడీ మనస్కరించడం లేదని కానీ రూ. 15 లక్షల కోట్ల పారిశ్రామిక వేత్తల సొమ్మును రద్దు చేసేందుకు మాత్రం వెనుకాడ లేదన్నారు. మోడీ విధానాలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా

మిగతా 2లో..

## జూలై 19, 20 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

-ఆహ్వాన సంఘం అధ్యక్షునిగా కర్నాటి రాంమోహన్‌రావు






**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా 23వ మహాసభలు జూలై 19, 20 తేదీల్లో మధిరలో జరగనున్నాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆహ్వాన సంఘు సమావేశం శనివారం స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఆహ్వాన సంఘు సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తో పాటు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మధిర ప్రాంత నాయకులు, ప్రముఖ విద్యావేత్త కర్నాటి రాంమోహన్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 23వ మహాసభలు మధిరలో జరనున్న నేపథ్యంలో

మిగతా 2లో..

# వ్యాధుల కాలం.. తస్మాత్ జాగ్రత్త..!

(మొదటిపేజీ తరువాయి)

టైఫాయిడ్, చికెన్ గున్యతో ప్రతీ ఏటా మన్యం అట్టుడికి పోతోంది. ఇలాంటి పరిస్థితులను ఈ ఏడాది అరికట్టేందుకు వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కీటక జనిత వ్యాధులు...**

ఏజెన్సీలో ప్రతీ ఏడాది వర్షా కాలంలో జ్వర పీడితులు అధికంగా నమో దువుతున్నారు. ఈ వ్యాధుల నివారణకి ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ ప్రతీ మంగళవారం రక్తపూతన సేకరించి పరీక్షలు నిర్వహిస్తారు. సీజన్ వస్తే మంగళవారంతో పాటు శుక్రవారం కూడా రక్తపూతలు తీసుకుం టున్నారు. ఈ మధ్యకాలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీలు వచ్చిపోతుండటంతో కీటక జనిత వ్యాధుల నమోదు పెరుగుతోంది.

**142 సమస్యాత్మక గ్రామాలు...**

వైద్యఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఏజెన్సీలో 142 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. గత రెండేళ్ల క్రితం ఈ సంఖ్య 297 గా ఉండేది. కానీ జ్వర పీడితుల సంఖ్య తగ్గుతున్నట్లు లెక్కలు చూపిస్తున్నప్పటికీ వాస్తవానికి విరుద్ధంగా ఉంటున్నాయి. సీజనల్ వ్యాధులు కాలం వచ్చిం దంటే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు క్రిక్కిరిసి పోవడమే ఇందుకు నిద ర్శనం. జిల్లాలో వైద్య కళాశాల 1, జిల్లా ఆస్పత్రి 1, ఏరియా ఆస్పత్రులు 2, సివిల్ ఆస్పత్రులు 8, పిహెచ్‌సిలు 39,సిహెచ్‌సిలు 8, సబ్ సెంటర్లు 329తో పాటు పల్లె దావాఖానాలు ఉన్నాయి. వీటిలో హై రిస్కు గ్రామాలు పూర్తి అటవీ ప్రాంతంలో ఉండటంతో వర్షా కాలంలో పరిస్థి తులు భిన్నంగా మారుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించినప్ప టికీ స్థానిక పరిస్థితులు మూలంగా జనం జ్వరాల భారినపడుతున్నారు. ఇదిలా ఉండగా వైద్య సిబ్బంది పనితీరు కూడా అరాజకంగా లేనట్లు ప్రచారం సాగుతోంది. అటవీ గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడం తో ప్రజలు ప్రధాన రహదార్లకు వచ్చే పరిస్థితి ఉండటం లేదు. దీంతో ఆవాగుల్లో నీటినే వారు సేవించడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అటవీ ప్రాంతాల్లో చెత్త పెద్ద ఎత్తున పెరగడం, నీరు నిల్వ ఉండటంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు దోమకాటు భారిన పడి జ్వరాలు తెచ్చుకుంటున్నారు. మరో ప్రక్క వేసవి కాలంలో అటవీ ప్రాంతాల్లో జంతుల మాంసాన్ని సేకరించి ఎండబెట్టుకుంటారు. వానం కాలంలో ఆ మాంసం సరిగా భద్ర పరచుకోక పోవడంతో బ్యాక్టీరియా చేరుతుంది. దానినే వంపకుని తినడం వల్ల కూడా వ్యాధుల భారిన పడుతున్నారు.

**దోమల మందు పిచికారీ...**

కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రభుత్వం దోమల మందు పిచికారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ముందుగా హాస్టళ్లలో పిచికారీ చేయిస్తున్నారు.హై రిస్క్ 12 గ్రామాల్లోదోమల మందు మొదటి విడత స్ప్రే చేస్తున్నారు. మరింత వేగంగా పిచికారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

**జాగ్రత్తలు పాటిస్తే సరి :**
**డా. చైతన్య, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ**



కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎం హెచ్ఓ డా.ఆర్ చైతన్య తెలిపారు. ప్రధానంగా హై రిస్క్ గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుంజా చూసు కోవాలని, టైర్లు, పూల కుండీల్లో నీటిని తొలగించాలని, ఇంటి పరస రాల్లో కాలువల్లో బ్లీచింగ్ చల్లుకోవా లని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని సేవించడం మంచిదని, ఈ సీజ నల్లో వేడివేడి ఆహార పదార్థాలు, సువులుగా జీర్ణమయ్యే వాటిని తీసుకో వడం మంచిదన్నారు. ఎవరైనా జ్వరాల భారిన పడితే వెంటనే వైద్యు లను సంప్రదించాలని, గ్రామాల్లో జ్వరపీడితులు ఉంటే ఆ ప్రాంతా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలను సమాచారం ఇవ్వాలని, వైద్య సిబ్బంది రక్తపూ తలు సేకరించే సమయంలో సహకరించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో గర్భిణీలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వైద్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయిస్తూ ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాన్నారు.

# విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు తయారు చేసిందన్నారు. విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, ఎటువంటి అంశాలు చేరిస్తే రైతులకు మేలు జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఉమ్మడిజిల్లా పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పత్తి, మిర్చి సాగు చేసే రైతులు చాలా కాలంగా నష్టపోతున్నారని ఆయన తెలిపారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలనే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు లేబుల్ లేని విత్తనాల ప్యాకెట్లు, లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దన్నారు. ప్రతి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు అందు బాటులో పెట్టడం జరిగిందన్నారు. రైతులు అధికారులతో సమన్వయం చేసుకుని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు ఆర్. గోపాలరెడ్డి మాట్లాడుతూ గతంలో రైతు తన విత్తనం ఉత్పత్తి చేసుకుని పంటలు పండించే వారని నేడు ఆ పరిస్థితి లేకుండాపోయిందన్నారు. గతంలో ములుగు జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల ద్వారా నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం జరి గితే రైతులకు రూ. 4 కోట్ల పరిహారం సంబంధిత కంపెనీ ద్వారా అందించడం జరిగిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరి గినా రైతు సంక్షేమ కమిషన్‌కు ఫిర్యాదు అందిస్తే వారి తరుపున సంపూర్ణ పోరాటం చేయడం జరుగుతుందన్నారు. గతంలో పేదలు తిన్న ఆహారం నేడు ధనవంతులు తింటున్నారని తెలిపారు. వరి పంటతో పాటు పప్పు దినుసులకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. గతేడాది రూ. 21వేలు ఉన్న మిర్చి పంట ఈ ఏడాది రూ. 12వేలకు పడి పోయిందని దీని వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ సమావే శంలో రైతు సంఘాల నాయకులు, పలువురు రైతులు, న్యాయవాది, పలువురు వ్యవసాయ అధికారులు తదితరులు మాట్లాడారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మంజిల్లా వ్యవ సాయ అధికారి పుల్లయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధి కారి బాబురావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**విత్తన చట్ట లోపాలను సరి చేయాలి : దొండపాటి**



నకిలీ విత్తన కంపెనీల భారిన పడ కుండా విత్తన చట్టం లోపాలను సరి చేసి నాణ్యమైన విత్తనాలను రైతు లకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్య క్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వా లకు సూచించారు. ఖమ్మం కలెక్టర్ ఆఫీస్‌లో విత్తన బోర్డు సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విత్తన ముసాయిదా చట్టం కమిటీ సమా వేశంలో దొండపాటి రమేష్ పాల్గొని పలు సూచనలు చేశారు. అనేక రకాల విత్తన కంపెనీలు పుట్టుకొచ్చి గ్రామాల్లో ఆర్గనైజర్లను ఏర్పాటు చేసుకుని మొక్కజొన్న, పత్తి వంటి అనేక రకాల విత్తనాలను రైతులకు ఇచ్చి మోసం చేస్తున్నాయన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే కంపెనీ యజమానులపై, వారిని ప్రోత్సహించే వారిపై పిడి కేసులు పెట్టి జైలుకు పంపించేవిధంగా విత్తన చట్టం రూపకల్పన జరగాలన్నారు. జిల్లాలు, మండలాల వారీగా విత్తన గోడౌన్లను ఏర్పాటు చేసి విత్తన డీలర్లు ప్రభుత్వ అనుమతితోనే నాణ్యమైన విత్తనాలు ఇచ్చేవిధంగా చట్టం రూపొందించాలని సూచించారు. విత్తన నష్టం జరిగినప్పుడు రైతులకు మేలు జరిగేవిధంగా విత్తన బీమా సౌకర్యం కూడా కల్పించాలన్నారు. పంట నష్ట పరిహారంతో పాటు విత్తన నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకునేవిధంగా చట్టం తయారు చేయాలన్నారు. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వుల చట్టం 1987, ఆంధ్రప్రదేశ్ పత్తి విత్తన చట్టం 2007 చట్టాలను పరిగణలోకి తీసుకుని విత్తన ముసాయిదా చట్టాన్ని పకడ్బందీగా రూపొందించాలని ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. దొండపాటి రమేష్ తో పాటు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, యర్రా శ్రీను పాల్గొని పలు సూచనలు చేశారు.

### జిల్లా రవాణా
# అథారిటీ సభ్యునిగా జోషి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా ప్రాంతీయ రవాణా అథారిటీ సభ్యునిగా బాదండ్ల జోషి కుమార్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ జితేష్ పాటిల్‌ను జోషికుమార్ మర్యాద పూర్వకంగా కలిసి ఉత్తర్వులను చూపించి ప్రోటోకాల్ పాటించాల్సిందిగా కోరారు.



# జూలై 19, 20 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)



ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు ఖమ్మం కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీ లకు ప్రాతినిధ్యం వహిస్తూ 600 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకాను న్నారన్నారు. దివంగత సిపిఐ నేత పోటు ప్రసాద్ నగర్‌లో మహాసభలు జరుగుతా యని సురేష్ తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న మధిరలో మహాసభలు జరగడం విశేషమ న్నారు. నల్లమల గిరిప్రసాద్, సర్దార్ జమలాపురం కేశవరావు, వాసిరెడ్డి వెంకటపతి, రావెళ్ల జానకి రామయ్య లాంటి అనేక మంది యోధులు ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడారని సురేష్ గుర్తు చేశారు. అమరుల స్ఫూర్తితో మహాసభలను నిర్వహించుకుని మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ నిర్దేశించుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా కర్నాటి రాంమోహ న్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బెజవాడ రవిబాబు, ప్యాట్రన్స్‌గా మందడపు రాణి, ఎంఎ రహీం, బత్తినేని నీరజ, కోశాధికారి కొండలరావు ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఉపాధ్యక్షులుగా జమ్ముల జితేందర్‌రెడ్డి సహా 15 మందిని ప్రధాన కార్యదర్శులుగా మరో 15 మంది తో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లత, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి, మందడపు రాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంపై యుద్ధ మేఘాలు

(మొదటిపేజీ తరువాయి)

మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఇప్పుడు ఆ హామీలను విస్మరించి పాలన సాగిస్తుందని హేమంతరావు తెలిపారు. హామీల అమలుకు సంబం ధించి ప్రజల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు ఉన్నాయని ప్రజల ఆశలకు అనుగుణంగా పని చేయక పోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా పేదలకు ఇస్తా నన్న ఇందిరమ్మ భరోసా అమలుపై ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఇంత వరకు పేదల ఖాతాల్లో రూపాయి జమ కాలేదని రైతు భరోసా, రైతు రుణమాఫీ పై రైతుల్లో ప్రభుత్వం పై అప నమ్మకం ఏర్పడుతుందన్నారు. హామీల అమలుకు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పని చేయాలని హేమంతరావు సూచించారు. వ్యవసాయ రంగానికి ఊతమిస్తేనే రైతాంగం ముందుకు సాగు తుంది తప్ప లేకపోతే వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చించుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునేందుకు మహాసభలను నిర్వహించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా రాష్ట్ర కంట్రోల్ కమి షన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు మాట్లాడారు. ప్రజా సంఘాల మహాసభలను జిల్లా మహాసభల లోపు నిర్వహించాలని అన్ని మండల మహాసభలను సకాలంలో పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది.

# రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : లోక్ అదాలత్ లో కేసును ఇరు పక్షాలు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అంతిమ తీర్పుపై ఎటువంటి అప్పీల్‌కు అవకాశం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. ఉమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకుని సివిల్, రాజీపడ దగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని, ఎటువంటి రుసుము, సమయం వెచ్చించాల్సిన అవ సరం లేదన్నారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటి గేషన్ (భార్య భర్తల కేసులు, డబ్బు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు) కూడా పరిష్కారం అవుతాయన్నారు. చెక్ బౌన్స్ కేసులు చర్చల ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవచ్చు నని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఖమ్మంజిల్లాలో ఇప్పటి వరకు 3,500 సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేశామని తెలిపారు. 62 మోటార్ వాహన ప్రమాద కేసులలో రాజీ ద్వారా రూ. 2.80 కోట్ల పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులకు ఉంటుంద న్నారు. న్యాయవాద సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనవసరంగా ప్రైవేటు సెటిల్‌మెంట్లు చేసుకోవాల్సిన అవ సరం లేదన్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారున్ని కోల్పోయిన వృద్ధ మహిళ గొర్ల రత్నమ్మ తరు పున న్యాయవాది ఇమ్మడి లక్ష్మి నారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్ డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా రూ. 11.50 లక్షలు అవార్డు అందజేశారు. భవాని వీరభద్రం భార్య భర్తల వివాదానికి సంబంధించిన కేసు రాజీ ద్వారా పరిష్కరించడం జరిగింది. అనంతరం పాత్రి కేయులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కోర్టు పరిధి లోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టుల్లో కూడా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనలు, సలహాల మేరకు జాతీయ లోక్ అదాలత్ జరుపుకుంటున్నామన్నారు. లోక్ అదాలత్ వల్ల ప్రజ లలో మంచి వాతావరణం ఏర్పడుతుందని వివాదాలు తగ్గిపోతాయన్నారు. ప్రశాంత వాతావ రణం ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. ఈ కార్య క్రమంలో న్యాయమూర్తులు ఉమాదేవి, దేవినేని రామ ప్రసాదరావు, వి. శీనయ్య, ఎం. అర్చన కుమారి, ఎన్.కల్పన, మురళీమోహన్, కెవి చంద్రశేఖర్‌రావు, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందుప్రియ, మాధవి, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ గద్దల దిలీప్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులు బందారుపల్లి గంగాధర్, పి. సంధ్యారాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ, రాంబాబు, మందడపు శ్రీనివాసరావు, న్యాయశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి కుట్ర



-సిపిఐ వైరా నియోజక వర్గ ఇంచార్జి యర్రా బాబు

ప్రజాపక్షం/ కొణిజర్ల : అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందని సిపిఐ వైరా నియోజక వర్గ ఇంచార్జి యర్రా బాబు తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామంలో నాగవరపు భద్రయ్య అధ్యక్షతన జరిగిన సిపిఐ శాఖ మహాసభలో యర్రాబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజాస్వామ్య, లౌకికవాద భావజాలంతో అన్ని వర్గాలు, మతాలకు, కులాలకు సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని మార్చి మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చి దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి విడదీసే కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆశల ఆకాంక్షలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మణిగ కోటేశ్వరరావు, పిఏసిఎస్ డైరెక్టర్ పాపగంటి సుదర్శన్, పరిటాల భద్రయ్య, శాంసన్, కొత్తపల్లి నాగయ్య, పాపగంటి విజయ్‌కుమార్, పాపగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నమునగాల సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా పాపగంటి సుదర్శన్, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి నాగయ్య లతో పాటు 11 మందితో గ్రామశాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు కుట్ర

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటి యుసి) ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ ఆరోపించారు. శనివారం ఖమ్మంలో కూలీల అడ్డా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గాదె లక్ష్మి నారాయణ మాట్లాడుతూ 1996లో భవన నిర్మాణ కార్మి కుల కోసం తీసుకు వచ్చిన సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. దీని వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏఐటియుసి పోరాటం వల్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే రూ. 6 లక్షలకు నుంచి రూ. 8 లక్షలకు పరిహారాన్ని పెంచారన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు సంక్షేమ బోర్డును అప్పగిస్తే కార్మిక శాఖకు ఎటువంటి సంబంధం ఉండదన్నారు. సంక్షేమ నిధులను కార్మికులకు కాకుండా ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. భవిష్యత్తు కార్మిక చట్టాలు లేకుండా చేసే




ప్రమాదం ఉందన్నారు. సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఈనెల 17న హైదరాబాద్ కార్మిక శాఖ కార్యాలయం నందు జరుగు మహాధర్నాలో ఖమ్మం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొడ్డగొర్ల శ్రీను, జిల్లా కోశాధికారి మూలగుండ్ల గోపీనాథ్, జిల్లా నాయకులు దేవా శ్రీను, ఈసారపు వెంకటేశ్వర్లు, సాధు నాగరాజు,లక్ష్మ య్య, సుధాకర్ రావుపాల్గొన్నారు.

# 16న మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/ మధిర : మధిర మార్కెట్ యార్డ్ నందు ఈ నెల 16న సోమవారం మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రబి ధాన్యాన్ని ప్రభుత్వం తరుపున స్వయం సహాయక సంఘాల ద్వారా మూడు మండలాల్లో 1035 మంది రైతుల వద్ద 51,207 క్వింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేసి సుమారు 12కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయటం జరిగిందని తెలిపారు. రైతు పండించిన సన్నధాన్యాన్ని కొనుగోలు చేసి 500రూపాయల బోనస్‌ని కూడా వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయటం జరిగిందని, ఇదే తరహాలో భవిష్యత్‌లో మధిర మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి స్థానిక శాసనసభ్యులు, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహాయ



సహకారాలతో మధిర మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తూ రైతులకు సేవ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. మిర్చి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా లోక్‌అదాలత్‌లో 529 కేసులు పరిష్కారం




ప్రజాపక్షం/ మధిర : మధిర కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 529 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అధ్యక్షతన నిర్వహించారు. మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 289 కేసులు పరిష్కారం కాగా రూ.1,32,900 జరిమానా విధించారు. అదేవిధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 240 కేసులు పరిష్కారం కాగా రూ.3,86,800 జరిమానా విధించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసుల్లో విధించే జరిమానాలో కొంత మొత్తాన్ని బాధితులకు అందచేసే విధంగా అవార్డులు తయారు చేసి బాధితులకు అందచేయటం కొత్తవరవడిని సృష్టించిందగా దీని వలన బాధితులకు ఎంతో కొంత న్యాయం చేసినట్లు అవుతుందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. సివిల్ జడ్జి ప్రశాంతి చేతుల మీదుగా అవార్డులు కాపీలు అందచేశారు. ఈకార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లారావు, మధిర పట్టణ సిఐ రమేష్, ఎస్సై చంద్రశేఖర్, బ్యాంక్ అధికారులు, పోలీస్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



ప్రజాపక్షం/వైరా: ఇటీవల వైరా శాంతి నగరకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త ఎక్కి రాల వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు బిఆర్ఎస్ పార్టీ లో సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును మంజూరు చేసింది. శనివారం ఆ చెక్కును ఖమ్మంలో స్వర్గీయ వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ నివాసం నందు బానోతు మదన్‌లాల్ సతీమణి బానోతు మంజుల మదన్‌లాల్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బానోతు మంజుల మదన్‌లాల్ మాట్లాడుతూ ప్రతి బిఆర్‌ఎస్ కార్యకర్తకు అండగా ఉంటాం, ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి తన్నీరు జ్యోతి, కొత్తా వెంకటేశ్వర రావు, కిలారు కిరణ్, అప్పం సురేష్, మేదరమెట్ల రాము, తన్నీరు కిషోర్, ఆదూరి ప్రేమ్‌కుమార్, నల్లబోలు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బొక్క జయరాజుకి పలువురి నివాళి



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం కొష్టాల గ్రామానికి చెందిన హార్మోని కళాకారుడు బొక్క జయరాజు(82) అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. శనివారం కొష్టాల గ్రామంలో కళాకారుడు బొక్క జయరాజు దశదిన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బొక్క నాగరాజు కూతురు శారదను పరామర్శించి ఓదార్చారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, మాజీ సర్పంచ్ బట్టా పెద్ద భద్రయ్య, దొడ్డా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక పుణ్యస్నానాలు చేసేందుకు మెట్లు నిర్మించండి



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామంలో ఉన్న కాల్వ వద్ద కార్తీకమాసం సమయంలో భక్తులు స్నానాలు ఆచరించడానికి ఇబ్బందికరంగా ఉందని అందు కోసం మెట్లు ఏర్పాటు చేయాని తాటిపూడి కాంగ్రెస్ నాయకులు నీటిపారుదలశాఖ ఏఈ వెంకటకృష్ణకు వినతిపత్రం అందించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో గ్రామంలో పూజలు చేసే సమయంలో ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన అధికారులు మెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జవ్వాజి నాగరాజు, మంచాల జయరాజు, తాతా నిర్మల, దుగ్గిరాల శ్రీను, జవ్వాజి వెంకటేశ్వర్లు, కాట్రాల నర్సింహారావు, జవ్వాజి ఆంజనేయులు, జవ్వాజి పుల్లయ్య, నారపోగు సైదులు, నారపోగు చంద్రయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను ప్రశ్నించినందుకే కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమన్నందుకే బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేశారని తిరుమలాయపాలెం బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు భాషబోయిన వీరన్న అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీల అమలుపై ప్రశ్నించినందుకే కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేసిందని, ఇది హేయమైన చర్యని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ఫార్ములా ఈకార్ రేస్ ఎంతో అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిందని, కక్షపూరితంగా కెటిఆర్‌పై తప్పుడు అభియోగాలు మోపుతూ ఈ కార్ రేస్ కేసులో ఎసిబి నోటీసులు జారీ చేయడం దుర్మార్గ చర్యగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సుపరిపాలన అందించి మెప్పు పొందాలి తప్ప అరాచకాలకు అక్రమ కేసులకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వ పరువు తీయొద్దని ఆయన తెలిపారు. ఈ కార్ రేస్‌లో త్వరలోనే వాస్తవాలు బయటికి వస్తాయని, అప్పుడు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

## నేడు వైరాలో భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలు

పాల్గొననున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు వేడుకలను నేడు వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నిర్వహించ నున్నారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్‌తో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## కేంద్ర సర్వీస్‌లో వరప్రసాద్ ఉద్యోగం పొందడం పట్ల హర్షం



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని మేకలతండా నివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బానోత్ రామ్మూర్తి నాయక్ కుమారుడు బానోత్ లక్ష్మీ వరప్రసాద్‌కు యూపిఎస్సీ సర్వీస్‌లో డిఎస్‌పి ఉద్యోగం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీ, గుగులోత్ భీముడు, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, సురేందర్ మనియర్, దారావత్ భద్రు, బానోత్ రాంచందర్, ఆలోత్ ఈశ్వరి బాయి, గడ్డం వెంకన్న, మాళోత్ భావసింగ్, శకుంతల కిషోర్, పద్మావతి రాందాస్, గాంధీ, హర్ష, గమిడి నర్సింహారావు, కడియాల సుధాకర్, హనీఫ్, బానోత్ రాందాస్, కిలారి లక్ష్మి అప్పారావు, దారావత్ వినోద్ నాయక్, గౌస్, జానీ, షబ్బీర్, షేరు, షఫీ, తాజుద్దీన్, సట్టు వీరభద్రం, పాటి నర్సయ్య, తోటకూరి రాంబాబు, జగన్నదాం, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## రామాలయాన్ని అభివృద్ధి చేయండి



ప్రజాపక్షం/కారేపల్లి: కొత్తూరు తండా గ్రామంలో వెలసిన శ్రీ రాముని గుడి అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మేనల్లుడు కార్యాలయ ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డినీ ఆలయ అర్చకులు బానోతు సురేష్, రవీందర్‌లు కలిసి మెమొరాండం ఇచ్చారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం మెమొరాండం ఇవ్వడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, రుప్తా నాయక్‌లు పాల్గొన్నారు

## గ్రామంలో అరాచకాలను అరికట్టి శాంతి భద్రతలను కాపాడాలి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని భీమవరం గ్రామం రాజకీయాలకతీతంగా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అభివృద్ధి పేరుతో అరాచకాలు సృష్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వ్యక్తిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాక్‌రావు డిమాండ్ చేశారు. శనివారం భీమవరం బోడేపూడి భవన్ నందు జరిగిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని చెబుతూ ఒక వ్యక్తిగత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఫెన్సింగ్ రాళ్లను, వైరును తొలగించి అక్రమంగా 190 సర్వే నెంబర్ భూమిలో దౌర్జన్యంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ భూమి తనదే అంటూ గ్రామంలో వివాదాలు సృష్టిస్తున్నాడని, రైతుల పంటలకు నీటి వసతి కోసం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ధ్వంసం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో తన రాజకీయ ఆదిపత్యం కోసం ప్రాకులాడుతూ అభివృద్ధి ముసుగులో గ్రామంలో వివాదాలు, అరాచకాలు సృష్టిస్తున్న వ్యక్తిపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు చేపట్టి గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు హన్మంతరావు, సగ్గుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకట్రావయ్య, గొల్లపూడి చిన్నకోటేశ్వరరావు, గొల్లపూడి నారాయణ, దివ్వెల వీరాంజనేయులు, సామినేని మహేష్, మందడపు భాస్కర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమానికి ఏర్పాట్లు చేయండి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రేపు జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి మాట్లాడుతారని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని 58 రైతు వేదికలను సర్వాంగ సుంధరంగా తీర్చిదిద్దాలని, మామిడితోరణాలు, రంగువల్లులతో అలంకరించాలన్నారు. సాయంత్రం 4 గం.కు ముఖ్యమంత్రి మాట్లాడుతారని, ఆడియో, విడియోలోపాలు లేకుండా ఖచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు వేదిక వద్దకు రైతులు మధ్యాహ్నం 2 గం.లకే చేరుకునేలా తగినజాగ్రత్తలు తీసుకోవాలని, వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతీ రైతు వేదిక పరిధిలోని రైతులకు సంబంధించి ఎంత మొత్తంలో రైతుభరతో అందుతుందో వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. మునగసాగు చేపట్టి లాభాలు గడించిన రైతులను ఆహ్వానించాలని, ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశమొత్తం జిల్లా వైపు చూస్తోందని, దీనికి సహకరించిన ప్రతీ ఒక్కరినీ కలెక్టర్ అభినందించారు. రానున్న వర్షాకాలంలో నీరు నిలుస్తున్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

## మున్నూరు కాపు కార్పోరేషన్ కోసం కృషి చేస్తా

**-రేణుకాచౌదరికి రుణపడి ఉంటా**
**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు**





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రేచర్ల బజార్‌లో ఏర్పాటు చేసిన మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుకు ఘనంగా సన్మానం నిర్వహించారు. పిసిసి ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలో కాపులకు ఒకే ఒక్క పదవి లభించిందని అదృష్టం నాకు దక్కటం కోంస ప్రయత్నం చేసిన కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతున్నానని కట్ల రంగారావు అన్నారు. అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కి కూడా తనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ప్రభుత్వ పెద్దలు, కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరి సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని, పెద్దలు అందరితో కలిసి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా నిరంతరం కృషి చేస్తానని కట్ల రంగారావు పేర్కొన్నారు. తన రాజకీయ జీవితం 35 సంవత్సరాల్లో నేను ఏ హోదాలో పనిచేసిన మున్నూరు కాపులు నా రాజకీయ జీవిత ఎదుగుదల్లో ఎతో కృషి చేశారని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మున్నూరు కాపులకు కూడా టిక్కెట్లు దక్కే విధంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు పాల్గొన్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రాముడు, కట్ల నాగరాజు, కామిశెట్టి రవికుమార్, కట్ల సంతోష్, దాసరాజు కుటుంబరావు, యన్నం నాగేంద్రరావు, రేచర్ల పుల్లయ్య, వీరంశెట్టి సీతారాములు, మూల దుర్గాప్రసాద్, ముదిగొండ మహేష్, ఆది శ్రీకాంత్, అక్కిశెట్టి రవితేజ, మిట్టపల్లి సైదులు, దండ్యాల నర్సింహారావు, రేచర్ల అసత్యం, రేచర్ల వెంకటేష్, పుప్పాల అనంతరామయ్య, పుప్పాల సైదులు, పాలెపు సైదులు, రేచర్ల ప్రభాకర్, రేచర్ల రాము, శీలం ప్రభాకర్, కంభంపాటి సత్యనారాయణ, రేచర్ల కారు విశ్వనాథం, రేచర్ల సైదులు, రేచర్ల చిన్న విశ్వనాథం, ఆర్‌వి, రేచర్ల జనార్ధన్, నవీన్, రేచర్ల వెంకటేశ్వర్లు, కరెంటు రామారావు, పెద్ద ఎత్తున మున్నూరు కాపు మహిళలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

**-ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన హెల్త్ డెరెక్టర్ రవీందర్ నాయక్**





ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి ఓపి రిజిస్టర్న పరిశీలించి అభినందించారు. ల్యాబ్ రూమ్, మందుల గది, డెలివరీ రూమ్, ఓపి రూమ్, ఆసుపత్రి చుట్టూ పరిసర ప్రాంతాలు, టాయిలెట్స్‌లను పరిశీలించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొక్కలను నాటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం మీటింగ్ హాల్‌లో హాస్పిటల్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను తెలిపారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, కొత్తగూడెం డిప్యూటీ డిఎంహెచ్‌ఓ చైతన్య, ఎన్‌సిడి పిఓ మధువరన్, జిల్లా టీవీ ప్రోగ్రాం ఆఫీసర్ పుల్లారెడ్డి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి సాహితి, ఆయుర్వేద వైద్యురాలు జయ, హెచ్‌ఈవో సోమ్లా నాయక్, హెచ్‌విలు రమణ, వెంకట నరసింహ, ఆసుపత్రి సిబ్బంది జితూ నాయక్, జై బాబు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడే ఏకైక కమ్యూనిస్టు పార్టీ సిపిఐ

**- సిపిఐ మండల మహాసభలో సాబీర్ పాషా**





ప్రజాపక్షం/ అశ్వారావుపేట : పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక అలుపెరగని పోరాటాలు చేసిందని భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా అన్నారు. సిపిఐ అశ్వారావుపేట మండల సమితి ఆధ్వర్యంలో శనివారం 16మండల మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీ బూర్జువ పార్టీలకు వ్యతిరేకంగా ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలను చేసిన ఘనత సిపిఐకి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని, వారికి త్వరలోనే గుణపాఠం చెబుతామని, దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు అందరూ ఏకమై కులమతబేధాలు లేకుండా ఎటువంటి వ్యత్యాసాలు చూడకుండా ప్రజాభీష్టం మేరకు ప్రజల కోసం పని చేసే ప్రభుతాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ప్రజల ఓట్లతో నెగ్గిన ప్రభుత్వాలు వారి ప్రయోజనాల కోసం పనిచేయాలని, అలా కాకుండా ఈ ప్రభుత్వాలు ప్రజలను దోచుకునే విధంగా పనిచేస్తున్నాయని అన్నారు. ముందుగా 49 సభ్యులతో కూడిన మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అశ్వారావుపేట సిపిఐ మండల ఇన్‌చార్జిగా గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శిగా వగెల అర్జున్‌రావును, సహాయ కార్యదర్శులుగా చిన్నయ్య, కోర్స తిరుపతిరావు, ముక్కంటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ మండల కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతిఒక్క సభ్యుడు మండలంలో పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల కార్యవర్గంలోని ప్రతిఒక్క సభ్యుడు సమయ స్ఫూర్తితో చురుకుగా పనిచేసి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో వీలైనన్ని స్థానాల్లో గెలిచే విధంగా ప్రయత్నం చేయాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నూకవరపు విజయకాంత్, డివిజన్ కమిటీ సభ్యులు జోగిరాజు, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ జాకీర్, జక్కం బలరాం, ఎఐటీయూసి నాయకులు పటాన్ జలాల్, అనీల్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, బ్యాంకుల ఆగడాలు అరికట్టాలి



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల జమలయ్య, మునగడప వెంకటేశ్వర్లు అన్నారు. రామవరం ప్రాంతంలో ఏడు వార్డుల బాధితులు మేషన్ కాలనీ, ప్రశాంత్ నగర్ పంచాయతీ తదితర ప్రాంతాల్లోని మైక్రో ఫైనాన్స్ బాధితులు సిపిఐ నాయకుల చెంతన చేరి వారి కష్టాలను, ఫైనాన్స్ బ్యాంకులు పెట్టే ఇబ్బందులను వారికి వివరించారు. శనివారం రామవరం పాత పోస్ట్ ఆఫీస్ ఎరియా లో ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ బ్యాంకుల బాధితులతో సమావేశమై వారు మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకులో ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చి , లబ్ధిదారుల పై దాడులకు దిగటం చట్టరీత్య నేరమని అన్నారు. మహిళల యొక్క మానసిక స్థితిపై దౌర్జన్యాలు చేస్తున్నారని వారి యొక్క ఆగడాలను మానుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో వారికి తగిన గుణపాఠం చెప్పవలసి ఉంటుందని హెచ్చరించారు. ఫైనాన్స్ నిబంధనలో ఉన్న ఇన్సూరెన్స్, వైద్యం మొదలైన సౌకర్యాలు ఉన్నాయని మాయ మాటలు చెప్పి పేద మధ్య తరగతి ప్రజలకు విచ్చలవిడిగా రుణాలు అందించి వారు కట్టలేని స్థితిలో వారిపై దౌర్జన్యానికి, గొడవలకు దిగటం సరికాదని హెచ్చరించారు. వర్షాకాలంలో పనులు దొరకక స్కూల్ పిల్లలు బుక్స్, ఫీజులు కట్టే సమయంలో వాళ్లు నాలుగు నెలలు గడువు అడుగుతున్నారు. తప్ప ఇచ్చిన అప్పును చెల్లించమని వారు చెప్పటం లేదని అన్నారు. తక్షణమే వారికి నాలుగు నెలల గడువు రుణాలు చెల్లించేందుకు అవకాశం ఇవ్వాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఏజెంట్లు ఒక వ్యక్తికి ఎన్ని రకాల లోన్లు ఇవ్వచ్చో లేదా ఎన్నైనా ఇవ్వచ్చా మరి నిబంధనలో లేదా అని పరిశీలించుకోకుండా రకరకాల లోన్లు బాధితులకు అందించి వాళ్లు రుణాలు చెల్లించలేని ఊబిలో నెట్టటం వారి కమిషన్ల కోసం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఏజెంట్లు వారి పద్ధతులు మార్చుకొని చట్ట పరిధిలో వారి విధులను నిర్వహించాలని వారికి సూచించారు. ఎవరైనా ఏజెంట్లు మహిళలకు ఇబ్బంది కలిగిస్తే వెంటనే వందకు సమాచారం అందించి వారి నుండి రక్షణ పొందాలని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తూముల శ్రీనివాస్, కనుకుంట్ల శ్రీనివాస్, జంజర్ల కృష్ణమూర్తి, సర్వ వీరభద్రం, మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ బాధితులకు పరామర్శ

**సిపిఐ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సాబీర్ పాషా**





ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట పట్టణంలో రోడ్డు విస్తరణలో దుకాణాలను కోల్పోతున్న బాధితులను సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్.సాబీర్‌పాషా పరామర్శించారు. శనివారం పట్టణంలో జరగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తమ జీవనాధారం కోల్పోయిన చిరు వ్యాపారులకు ధైర్యం చెప్పారు. అధికారులు, పాలకులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, చిరు వ్యాపారులను, పేదలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులు చేయాలని సాబీర్‌పాషా అధికారులను కోరారు. పెద్ద పెద్ద బిల్డింగులు ఉన్న చోట ఒకలా, పేదలు, చిరు వ్యాపారుల షాపులు ఉన్న చోట ఒకలా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, పేదలకు అన్యాయం జరిగితే సిపిఐ సహించే ప్రసక్తి లేదన్నారు. పేదలకు, చిరు వ్యాపారులకు న్యాయం చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన అన్నారు. అనంతరం అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సిపిఐ నియోజకవర్గ కార్యాలయాన్ని సాబీర్ పాషా ప్రారంభించారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో సిపిఐ కార్యాలయం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కూనంనేని పుట్టినరోజు వేడుకలు



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పుట్టిన రోజు సందర్భంగా సింగరేణి కాంట్రా క్టు వర్కర్స్ యూనియన్‌ఏఐటీయుసి ఆధ్వర్యంలో శనివారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. కొత్తగూడెం కార్పొరేట్ లోని ప్రాజెక్టు ప్లానింగ్ కార్యాలయం వద్ద సింగరేణి సివిల్ విభాగం, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, ప్రైవేటు డ్రైవర్స్, ప్రాజెక్టు ప్లానింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తమ ప్రియతమ నాయకుడు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారాని కై ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తున్న కూనంనేని సాంబశివరావు జన్మదిన సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యాకృష్ణ ఫర్ నాయకులు ఎం.చంద్రశేఖర్, సిహెచ్ శ్రీను, కే.నరసింహ, వినోద, అనసూర్య, లక్ష్మి, ప్రవీణ్ మధు, లక్ష్మీనారాయణ, వంశీ, జగన్, సందీప్ కుమార్, సరిత, శేఖర్ రామారావు, సూపర్వైజర్స్ యూనియన్ తరపున కె.విజయ్ కృష్ణ, బి.మల్సూర్, రాము, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గం

ప్రజాపక్షం/జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడుగుతూ, ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ కార్ రేసు కేసులో మరో సారి ఏసీబీ నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గమని వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లకావత్ గిరిబాబు అన్నారు. పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చడం కోసం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే విధంగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎంతో అద్భుతంగా హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించడం జరిగిందని, కానీ రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలు చేపడుతూ ఏదో రకంగా కేటీఆర్‌ను కేసులో ఇరికించాలని, ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నాడని, ఇలాంటి బెదిరింపు ధోరణులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అభివృద్ధి చేసింది ఎవరో అవినీతి చేస్తున్నది ఎవరో తప్పకుండా వాస్తవాలు త్వరలో బయటికి వస్తాయని అన్నారు.

## ఘనంగా విప్లవకారుడు చేగువేరా జయంతి



ప్రజాపక్షం/జూలూరుపాడు: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా యువతరానికి స్ఫూర్తి అని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ సమీర్, వ్యవస్థాపకులు ఇడుపుల రాజు అన్నారు. సోమవారం చేగువేరా 97వ జయంతి కార్యక్రమాన్ని జెపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తిలో, ఇంజనీరింగ్ విద్యలో పట్టా పుచ్చుకొని, బహు బాషలలో అనర్గలంగా మాట్లాడే ప్రావీణ్యం, రచయితగా, కవిగా రాణించిన వ్యక్తి చేగువేరా అన్నారు. ప్రజలను ఆర్ధిక, రాజకీయ, సాంఘిక దోపిడీ నుండి విముక్తి కోసం, సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలని పోరాటం చేసిన గొప్ప విప్లవకారుడు అని వెల్లడించారు. జీవితాంతం ప్రజల కోసం జీవించిన మహానాయకుడు అని అన్నారు. ఈకార్యక్రమంలో మాడుగుల నాగరాజు, జర్నలిస్ట్‌లు తంబర్ల నరసింహారావు, కడియాల నాగేశ్వరరావు, బుచ్చిబాబు, మాడుగుల నరేష్, చరణ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి, మంత్రులను కలిసిన కలెక్టర్







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లో ప్రగతి భవన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను, మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను వారు శాలువలతో సన్మానించారు.

# నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నీట్ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల ఖమ్మం విద్యార్థులు జాతీయ స్థాయిలో ఆలిండియా టాప్ ర్యాంకులతో పాటు అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయ కేతనం ఎగుర వేశారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో ఆలిండియా వెయ్యి లోపు రెండు, మూడువేల లోపు ఆరు, ఐదువేల లోపు 11, పది వేల లోపు 17, 15వేల లోపు 24, 20వేల లోపు 52 ర్యాంకులు సాధించి అగ్ర స్థానంలో నిలిచింది. డి. దుర్గగుజరి 267, ఐ. మనోహర్ 541, బి. చందన 1229, వి. రోహిత 2801, బి. భూమిక 3104, జి. శ్రీనిధి జ్యోతిర్మయి 3255, డి. శ్రీలేఖ 3658, డి. స్వరాజ్‌పాల్ 4175, ఎ. లిఖిత 4445, వై. ప్రియాంక 4481, బి. రిషిత 5898, జి. హేమశ్రీ 6011, బి. విషి 6293, బి. మాన్యశ్రీ 7130, బి. షాలిని 8236, వై. సరస్వతి స్ఫూర్తిక 8303, బి. సబిత 8439, జి. నవీన్ 11119, కె. సాయిజశ్వంత్ 11652, బి. మోహనదీప్తి 12353, ఎస్. లహరి 13800, జి. హర్షిత 14583, వి.దేవిశ్రీ 14729, జి. సాయి ప్రణవి 15936 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు మాట్లాడుతూ మారుతున్న పరీక్షా విధానాలకు అ నుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే తులనాత్మక విద్యా ప్రణాళికతో రాష్ట్రంలోనే బెస్ట్ అధ్యాపకులచే విద్యా బోధన అందిస్తున్నామన్నారు. నిరంతరం విద్యార్థులను పర్యవేక్షించడం వల్లే తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించగలుగుతున్నారని వారు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, అకాడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక అభినందించారు.

# నీట్ ఫలితాల్లో రెజొనెన్స్ ప్రభంజనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ 2025 ఫలితాల్లో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తమ ఆధిక్యాన్ని చాటుకున్నారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు తెలిపారు. వైఎస్‌రెడ్డి 460, ఎన్ రామ్‌చరణ్ 460, ఎన్. మాల్యాద్రి 444, ఎస్. లావణ్య 442, ఎస్‌కె బీణా 407, ఎన్. అజయ్‌కుమార్ 372, బి. హరి కృష్ణ 330, జి. లావణ్య 325, బి. సిరిచందన 300 వంటి మార్కులు సాధించారన్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి పటిష్ట ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధన అనుభవం కలిగిన మేనేజ్ మెంట్ కారణమన్నారు. ఇంటర్‌తో పాటు ఏఐఎంఎస్, నీట్,ఐఐటి, జేఈఈ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణ ఇవ్వడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వారు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన న్యూవిజన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ 2025 ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో పి. సంహిత 951, ఎల్. సాయిచరణ్ సింగ్ 1114, బి. గోపిచంద్ 1187, ఎం. ఆకాంక్ష 1197, ఎం. వైష్ణవి 1535, బి. సాయిశృతి 2571, టి. దివ్య 2991, బి. చైతన్య సాయి 3058, బి. అక్షిత 4281, ఆర్. శీతల్ 5553, జే. వివేక్ 5672, బి. యశ్వంత్ 5743 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఐఐటి అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పరిమిత సంఖ్య గల విద్యార్థులతో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ జిల్లా స్థాయిలోనే గాక రాష్ట్ర స్థాయిలోనూ బెస్ట్ జూనియర్ కళాశాలగా న్యూవిజన్ నిలిచిందన్నారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులను ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, డైరెక్టర్ సిహెచ్ గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపక బృందం అభినందించారు.

# నీట్ ఫలితాల్లో హార్వెస్ట్‌కు ఉత్తమ ఫలితాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ ఫలితాల్లో హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం శనివారం తెలిపింది. కళాశాలకు చెందిన తమన్నా , నయమాంజలి 564 మార్కులతో 3321 కేటగిరి ర్యాంకు, జి. రాణి ఉమా అలేఖ్య 544 మార్కులతో 6586 ర్యాంకు, బి. భార్గవి 449 మార్కులతో 1181 ర్యాంకు, జి. శ్రీమయి 356 మార్కులతో 6727 కేటగిరి ర్యాంకు, ఎండి అన్షియ ముస్కాన్ 487 మార్కులతో 8420 కేటగిరి ర్యాంకు, సరోజ్ రాజ్ పురోహిత్ 472 మార్కులతో 30997 కేటగిరి ర్యాంకు, ఎండి షయాన్ మునీబ్ 433 మార్కులతో 77202 కేటగిరి ర్యాంకు, ఎస్. జాహ్నవి 377 మార్కులతో 255757 ర్యాంకు సాధించడం జరిగిందన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి లు అభినందించారు.

# అనాధాశ్రమంలో అన్నదానం




**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక సరోజ అనాధాశ్రమంలో శనివారం అన్నదానం నిర్వహించారు. స్థానిక నన్నపునేని మోహన్ హైస్కూల్లో 200506 బ్యాచీకి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో స్థిరపడ్డ వారు చాలా కాలం తర్వాత ఒకే వేదిక వద్దకు చేరుకుని చిన్ననాటి మధురానుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం అనంతరం స్థానిక సరోజ అనాధశ్రమంలో రూ.7 వేల ఖర్చుతో అన్నదానం నిర్వహించడంతో పాటు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సిద్ది నవీన్‌కుమార్, రాఘవేంద్రరావు, రమేష్, సుదీర్, కన్నా సాహెబ్, షేక్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# వాగుదాటుతూ నీటిలో మునిగి వృద్ధుడు మృతి



**ప్రజాపక్షం/గుండాల :** వాగుదాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొండవటంచ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానిచెందిన ఈసం పాపయ్య (60) పాత దారే అనుకుని వాగులోతును అంచనా వేయకుండా దాటే ప్రయత్నం చేశాడు. కాగా ఆ ప్రాంతంలో సుమారు 100 మీటర్ల లోతున్న చెక్‌డ్యాం ఉంది. దీంతో ఆ వృద్ధుడు దానిని గమనించకుండా ఒక్కసారిగా నీళ్లలో మునిగిపోయాడు. కాగా శనివారం పాపయ్య మృతదేహం నీటిలో తేలియాడటాన్ని గమనించిన స్థానికులు బయటకు తీశారు. పాపయ్య మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై సైదా రహూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొని రోడ్డు ప్రమాదం



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని ఇల్లందు, ఖమ్మం ప్రధాన రహదారి మర్రిగూడెం గ్రామ సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడెం గ్రామ సమీపంలో ఖమ్మం నుండి ఇల్లందు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, ఇల్లందు నుండి ఖమ్మం వెళ్తున్న లారీ ఓవర్ టెక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో ఇరువాహనాల డ్రైవర్లకు, బస్సులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా వీరంశెట్టి పెళ్లిరోజు వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వీరంశెట్టి సీతారాములు దుర్గాభవాని దంపతుల పెళ్లిరోజు రేచర్ల బజార్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంశెట్టి సీతారాములుకు పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల సత్యంతో పాటు పలువురు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మున్నూరు కాపు సభ్యులు పాల్గొన్నారు.